## రిజర్వేషన్లు అడ్డుకునేందుకే 29 జీవో

### బీఆర్ఎస్ గ్రేటర్ నేత ఎంఎన్ శ్రీనివాసరావు

ముషీరాబాద్, అక్టోబర్ 20: ప్రభుత్వ మొండిపట్టుదలతో గ్రూప్-1 పరీక్షలు నిర్వహించి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయం చేయాలని చూస్తుందని బీఆర్ఎస్ గ్రేటర్ నేత ఎంఎన్ శ్రీనివాసరావు ఒక ప్రటనలో ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం 29 జీవో తీసుకువచ్చి నిరుద్యోగులను అయోమయానికి గురిచేస్తుందని, రిజర్వేషన్లు వర్తించకుండా చేస్తోందని విమర్శించారు. నిరుద్యోగులు ఆందోళనలు చేసినా పట్టించుకోకుండా ప్రభుత్వం మొండి పట్టుదలకు పోతుందని ఆరోపించారు. జీవో 29ని సవరించి, నిర్వహించతలపెట్టి మొయిన్స్ పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## టీ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీగా డాక్టర్ కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 20: తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా డాక్టర్ బోయ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఓయూ ఇంజినీరింగ్ కళాశాలలో లైబ్రేరియన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. గతంలో ఓయూ ఎస్సీ, ఎస్టీ నాన్‌టీచింగ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం సేవలందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెజిటెడ్ అధికారుల సంక్షేమం కోసం పాటుపడతానని చెప్పారు. అనంతరం ఆయనను పలువురు అధికారులు, ఉద్యోగులు అభినందించారు.

# బతుకమ్మ బహుమతుల ప్రదానం

● విజేతలకు అందజేసిన ఎమ్మెల్యే గోపాల్

ముషీరాబాద్, అక్టోబర్ 20: అడిక్‌మెట్ డివిజన్ రాంనగర్ గుండు అఖిల పక్ష కమిటీ అధ్వర్యంలో బతుకమ్మ సంబురాల లక్కీ డ్రా విజేతలకు ఆదివారం బహుతుల ప్రదానోత్సవం జరిగింది. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముఖ్యఅతిథిగా పాల్గొని బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బతుమ్మ పోటీలు వైభవంగా నిర్వహించడంతో పాటు కానుకలు అదించడం అభినందనీయన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను వైభవంగా నిర్వహించడం ప్రశంసనీయన్నారు. ఈ సందర్భంగా మొదటి బహుమతి సృజన, రెండో బహుమతి బి.స్వప్న గెలుచుకున్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు నేత శ్రీనివాస్, కొండపల్లి మాధవ్, బి.శ్రీనివాస్‌రెడ్డి, శ్యామ్‌సుందర్, విజయ్‌యాదవ్, ర్యాగటి నరేశ్, జగదీష్, కరణం సురేశ్, గిరి, అస్లాం, సాయిప్రసన్న, బొట్టు శ్రీను, ఎ.శ్రీనివాస్, యాదరిగి నేత, గోపి, రామారావు, అంబిక శివ తదితరులు పాల్గొన్నారు.

లక్కీడ్రా విజేతకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

## బ్రహ్మకుమారీస్ సేవలు విలువైనవి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

కంటోన్మెంట్/మారేడ్‌పల్లి, అబక్టోబర్ 20: ఎలాంటి స్వలాభం ఆశించకుండా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న బ్రహ్మకుమారీస్ సేవలు ఎంతో విలువైనవని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఆదివారం సికింద్రాబాద్‌లో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో నిర్మించిన శాంతి భవన్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం సిక్ విలేజ్‌లోని ఇంపీరియల్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. నిత్యం అనేక పనులతో తీవ్ర ఒత్తిడికి లోనయ్యే వారు రోజులో కొద్ది సమయం బ్రహ్మకుమారీస్ కార్యక్రమంలో పాల్గొంటే ఎంతో ఉపశమనం పొందుతారని తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ జడ్జి ఈశ్వరయ్య, రాజయోగిని, బీకే సంతోష్, బీకే కులదీప్, సరోజిని, నితిన్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బోయిన్‌పల్లిలో ఘనంగా ఉర్సు ఉత్సవాలు

అమీర్‌పేట్, అక్టోబర్ 20: ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి సనత్‌నగర్ బస్టాండ్‌లో గ్యార్వీ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ప్రార్థనల అనంతరం వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యేను నిర్వాహకులు అబ్రార్, జమీర్ బేగ్, హరూ, తాజ్ , ఖలీమ్ సన్మానించారు. బీఆర్ఎస్ నాయకులు ఖలీల్‌బేగ్, సురేశ్‌గౌడ్, ఫాజిల్, రాజు అస్లామ్ పాల్గొన్నారు.

**న్యూబోయిన్‌పల్లిలో..**

బొల్లారం: న్యూబోయిన్‌పల్లి చింతల్ బస్తీ, చిన్న తోకట్టలో 88వ ఉర్సు-ఈ-షరీఫ్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి ఉర్సులో పాల్గొని ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఒకటో వార్డు బీఆర్ఎస్ మైనార్టీ అధ్యక్షుడు ఆసిన్‌ఖాన్, అమీర్, ఇంతియాజ్, బేగ్, మక్తర్, రిజ్వాన్, సమీర్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ప్రార్థనలు చేసిన బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, కమిటీ సభ్యులు

## అంబేద్కర్ అభయ హస్తం నిధులు విడుదల చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న టీఎంఎస్ఎస్ అధ్యక్షుడు గడ్డ యాదయ్య

చిక్కడపల్లి, అక్టోబర్ 20: అంబేద్కర్ అభయ హస్తం పథకం నిధులు విడుదల చేయాలని తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం(టీఎంఎస్ఎస్) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు గడ్డ యాదయ్య మాదిగ డిమాండ్ చేశారు. టీఎంఎస్ఎస్ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. యాదయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో దళిత సంక్షేమానికి రూ.33,124,04 కోట్లు కేటాయించిందని, అంబేద్కర్ అభయ హస్తం పేరుతో స్వయం ఉపాధి రంగాలకు రూ.17వేల కోట్ల నిధులు కేటాయించిందన్నారు. కానీ ఇప్పటి వరకు నిధులు విడుదల చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బంధు సేవ సొసైటీ అధ్యక్షుడు పల్లెల వీరస్వామి, మాదిగ రాజ్యాధికార పోరాట సమితి అధ్యక్షుడు ఎన్.రమేశ్ మాదిగ, మాల, మాదిగల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ తిరుపతి, మాదిగల మేధావుల ఫోరం ప్రొఫెసర్ నతనియేల్ తదితరలు పాల్గొన్నారు.

## గైనకాలాజికల్ అల్ట్రాసౌండ్‌పై సింపోజియం

సింపోజియంలో పాల్గొన్న పలువురు నిపుణులు

అమీర్‌పేట్, అక్టోబర్ 20: స్త్రీ జననేంద్రియ పరిస్థితుల నిర్ధారణ, గైనకాలాజికల్ క్యాన్సర్లు ఆరోగ్య పరిస్థితులను గుర్తించడం ద్వారా తగిన చికిత్స సూచించడంలో ఆధునిక అల్ట్రాసౌండ్ విధానం కీలకంగా మారిందని గైనకాలాజికల్ అల్ట్రాసౌండ్ విభాగం నిపుణురాలు డాక్టర్ మాలా సిబల్ అన్నారు. ఫెర్నాండెజ్ హాస్పిటల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'అల్ట్రాసోనోగ్రఫీ ఆఫ్ ద అడ్నెక్సా అండ్ ఎండోమెట్రియం: ఆప్టిమైజింగ్ డయాగ్నసిస్ ఇన్ ఎవిరీడే ప్రాక్టీస్' అంశంపై ఆదివారం అమీర్‌పేట్‌లో సింపోజియం జరిగింది. 200 మందికి పైగా గైనకాలజిస్టులు, రేడియాలజిస్టులు, పాథలాజిస్టులు పాల్గొన్నారు. ఫెర్నాండెజ్ సీనియర్ కన్సల్టెంట్ గైనకాలజిస్ట్ డాక్టర్ కామేశ్వరి.ఎస్ సహా పలువురు నిపుణులు పలు అంశాలపై ప్రస్తావించారు. ఈ సింపోజియంలో కేస్ స్టడీ-ఆధారిత ప్యానెల్ డిస్కషన్, ఇంటరాక్టివ్ సెషన్లు జరిగాయి.

# పార్ట్ టైం అధ్యాపకుల సమస్యలు పరిష్కరించండి

ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డిని సన్మానిస్తున్న పార్ట్‌టైం అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 20: రాష్ట్ర యూనివర్సిటీల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ స్టేట్ ఆల్ యూనివర్సిటీస్ పార్ట్‌టైం టీచర్స్ అసోసియేషన్ (టీజీ ఏయూపీటీఏ) డిమాండ్ చేసింది. రాష్ట్ర ఉన్నత విద్యామండలి నూతన చైర్మన్, వైస్ చైర్మన్లుగా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, ప్రొఫెసర్ పురుషోత్తంను కలిసి వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యలను వివరించారు. నెలకు రూ.50 వేల వేతనం ఇవ్వాలని కోరారు. సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రం నాగేంద్రం, వైస్ ప్రెసిడెంట్ ఎం. కుమారస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ పి. శ్రీలక్ష్మి, ప్రతినిధులు వెంకట్‌రెడ్డి, కంచి రాజేశ్, మంచాల లింగస్వామి, శేఖర్, రాము, భిక్షపతి, విఠల్, మాధవి, ఎండీ ఖాన్, భీమ్‌రావు, పల్లవి, వేణుగోపాల్ శ్రీవైష్ణవ, గంగాధర్, ఏడుకొండల్, శంకర్, యుగంధర్, రంజిత్, రమేశ్, శారీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ పురుషోత్తంను కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎస్.యాదగిరి ఆధ్వర్యంలో అడ్డగుట్ట నేతలు ఆదివారం కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో నేతలు వెంకటలక్ష్మి, సుజి, సునీత, అరుణ, కమల, యాదగిరి, మల్లేశ్, రాజయ్య, పాపయ్య పాల్గొన్నారు. – అడ్డగుట్ట

## మక్కల కృష్ణ మృతి బాధాకరం

బన్సీలాల్‌పేట్: పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే మక్కల కృష్ణ మృతి బాధకరమని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ విచారం వ్యక్తం చేశారు. బన్సీలాల్‌పేట్ సున్నం బట్టికి చెందిన కృష్ణ ఇటీవల మృతిచెందారు. ఆదివారం దశదినకర్మకు హాజరైన ఎమ్మెల్యే ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నేత వెంకటేశంరాజు, లక్ష్మిపతి, ప్రేమ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి

చిక్కడపల్లి, అక్టోబర్ 20: పోస్టల్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని తెలంగాణ సర్కిల్ హైదరాబాద్ చీఫ్ పోస్టుమాస్టర్ డాక్టర్ పి.విద్యాసాగర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నేషనల్ యూనియన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ పోస్టమాన్, ఎంటీఎస్, జీఆర్-సీ తెలంగాణ సర్కిల్ ద్వైవార్షికోత్స సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఆయన మాట్లాడుతూ 8వ వేతన సవరణ కమిటీని వేసి ఇప్పుడున్న ఆర్థిక విధానానికి అనుగుణంగా వేతనాలను పెంచాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పోస్టల్ శాఖను ప్రైవేటు పరం చేయాలని ఆలోచనను విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్‌యూపీఈ సర్కిల్ సెక్రటరీ ఎం.కృష్ణ, హైదరాబాద్ సౌత్ ఈస్ట్ డివిజన్ నాయకులు జి.హైమావతి, వాసిరెడ్డి శివాజీ, నర్సింహారెడ్డి, ఎన్.శ్రీకాంత్, హనుమంత్‌రావు, కె.శ్రీకాంత్ పాల్గొన్నారు.

## మాదిగ విద్యార్థుల సదస్సును జయప్రదం చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 20: ఈనెల 24న వరంగల్‌లో జరిగే రాష్ట్ర యూనివర్సిటీల మాదిగ విద్యార్థుల సదస్సును జయప్రదం చేయాలని ఎంఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పల్లెర్ల సుధాకర్ పిలుపునిచ్చారు. ఎంఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఆదివారం నిర్వహించారు. సుధాకర్ మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా వర్గీకరణను అమలు చేస్తానని హామీ ఇచ్చి సీఎం మాటతప్పుతున్నారని మండిపడ్డారు. డీఎస్సీ నియామకాలు, గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగ నియామకాల్లో మాదిగ నిరుద్యోగులకు ద్రోహం చేస్తున్న రేవంత్ ప్రభుత్వ మోసానికి నిరసనగా ఉద్యమ కార్యచరణలో భాగంగా ఈనెల 24న వరంగల్ కాకతీయ వర్సిటీలో సదస్సు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఎంఎస్ఎఫ్ రఘువరన్, ఏడెల్లి అజయ్, ఆదిత్య, రాజీవ్‌ప్రదీప్, కొండూరి సుచేంద్ర, చిప్పలపల్లి ప్రశాంత్, మహేందర్, విజయ్, వినయ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## సగరుల సంక్షేమమే ధ్యేయం

చిక్కడపల్లి, అక్టోబర్ 20: సగరుల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్టు సగర క్షత్రియ వెల్ఫేర్, చారిటబుల్ ట్రస్ట్, అఖిల భారత సగర మహాసభ నాయకులు అన్నారు. సగర క్షత్రియ వెల్ఫేర్, చారిటబుల్ ట్రస్ట్, అఖిల భారత సగర మహాసభ ఆధ్వర్యంలో ఆదివారం సుందయ్య విజ్ఞాన కేంద్రంలో సగర(ఉప్పర) వివాహ పరిచయ వేదిక నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ ప్రకాశ్‌రావు, వైస్‌చైర్మన్ ముత్యాల హరికిషన్, మేనేజింగ్ ట్రస్టీ భీమ్‌రావు, శ్రీరాములు, కొండల అనిల్‌కుమార్, కమటం వేణుగోపాల్, ఉప్పర హాజరై మాట్లాడారు.

హెచ్చరిక ప్రకటన

సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయునదేమనగా, నా క్లయింట్ శ్రీమతి పివిఆర్ లక్ష్మి తండ్రి స్వర్గీయ పివి రాజమోహన్ రావు, భర్త సతీష్ ఖర్లెకర్, వయస్సు సుమారు 59 సంవత్సరాలు, వృత్తి: గృహిణి, నివాసం: ఇం.నం.1-8-530, చిక్కడపల్లి, హైదరాబాద్, ప్రస్తుత నివాసం: ఇం.నెం.1-1-230/9, ఫ్లాట్ నెం.202, సాయి కృష్ణ మ్యాన్షన్, చిక్కడపల్లి, హైదరాబాద్, టి.జి.-500020 వారు గతంలో కరీంనగర్ జిల్లా ఇప్పుడు పెద్దపల్లి జిల్లాలో వివిధ గ్రామాలు అనగా పెద్దపల్లి గ్రామం, రాజాపురం గ్రామం, నిట్టూర్ గ్రామం, తేల్కుంట గ్రామం, మొగుల్‌పహాడ్/ అంతర్రావ్ గ్రామంలో ఎక.100-00 గుంటలకు పైగా వ్యవసాయ భూములు మరియు పెద్దపల్లి టౌన్ మరియు గ్రామం వద్ద ఎక.2-00 గుంటలకు పైగా విస్తీర్ణం దేవడిగా పేరొందిన నివాస ఇల్లు మరియు చిక్కడపల్లి, హైదరాబాద్ వద్ద గల 1684 చ.గజాలు విస్తీర్ణం, ఇం.నెం.1-8-530 కలిగిన లలిత్‌మోహన్/పెద్దపల్లి రెసిడెన్సీగా పేరొందిన నివాస ఇంటికి కూడా తన తండ్రి పివి రాజమోహన్ రావు గారు చట్టబద్ధమైన యజమాని మరియు శాంతియుత స్వాధీనదారు అని తెలియజేశారు. పైన తెలిపిన సదరు పివి రాజమోహన్ రావు గారు భార్య శ్రీమతి పి.లలితాదేవీ మరియు కూతురు పివిఆర్ లక్ష్మి మరియు ఇద్దరు కుమారులు పివి రాజేశ్వర్ రావు మరియు పివి సంజీవ్ కుమార్‌లను కలిగి ఉన్నారు. ఆతరువాత సదరు పివి రాజమోహన్ రావు గారు పైన తెలిపిన తన భార్య, కూతురు మరియు ఇద్దరు కుమారులను పైన తెలిపిన ఆస్తులకు ఉత్తరాధికారులుగా మరియు న్యాయవారసులుగా వీలునామా రాయకుండా 1988లో మరణించారు. సదరు ఆస్తులు నా క్లయింట్ మరియు ఆమె సోదరులు మరియు ఆమె తల్లి మధ్య విభజించబడలేదు. ఆతరువాత ఆమె తండ్రి యొక్క పైన తెలిపిన ఆస్తులకు సంబంధించి నా క్లయింట్, ఆమె సోదరులు మరియు తల్లి సదరు పివి రాజేశ్వర్ రావుకు అధికారం ఇస్తూ రిజిస్టర్డ్ పవర్ ఆఫ్ అటార్నీ అమలు చేశారని ఆరోపిస్తూ సదరు పివి రాజేశ్వర్ రావు ఎస్.ఆర్.ఒ.చిక్కడపల్లి, హైదరాబాద్ వద్ద రిజిస్టర్ అయిన 19.02.1990 తేదీనాటి డాక్యుమెంట్ నెం.126/1990 కలిగిన పవర్ ఆఫ్ అటార్నీ సృష్టించారు. అయితే నా క్లయింట్ 19.02.1990 తేదీనాటి డాక్యుమెంట్ నెం.126/1990తో పాటు ఏవిధమైన పవర్ ఆఫ్ అటార్నీ అమలు చేయలేదు. ఆతరువాత నా క్లయింట్ తల్లి శ్రీమతి పి.లలితాదేవీ 2022 సంవత్సరంలో మరణించారు, అందువల్ల నా క్లయింట్ 08.10.2024న పవర్ ఆఫ్ అటార్నీ డాక్యుమెంట్ నెం.126/1990ను రద్దు చేశారు. అందువల్ల పివి రాజేశ్వర్ రావు పేరున సదరు పవర్ ఆఫ్ అటార్నీ 08.10.2024 నుండి మనుగడలో లేదు. అందువల్ల పవర్ ఆఫ్ అటార్నీ రద్దు చేయబడిన పైన తెలిపిన ఆస్తులకు సంబంధించి సదరు పివి రాజేశ్వర్ రావుతో కొనుగోలు లేదా అమ్మకం ఒప్పందాలు కుదుర్చుకోరాదని సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైనది మరియు హెచ్చరించడమైనది, ఈ హెచ్చరిక ప్రకటనను కాదని ఎవరేని అలా చేసినచో వారు తమ స్వంత నష్టపూచీకత్తుపై అలా చేసినవారవుతారు.

సం/- ఎమ్.ఆనంద్ రావు, అడ్వకేట్
ఆఫీస్: 1-8-1/ఎ/2/ఎ & బి, 1వ అంతస్తు, శ్రీ ఉదయ్ సాయి మెడికల్ హాల్ ఎదురుగా, బాగ్‌లింగంపల్లి క్రాస్ రోడ్స్, హైదరాబాద్-44, ఫోన్: 09246192948, 08121000558